క్లుప్తంగా

ఘనంగా అసిరితల్లి అమ్మవారి పండగ



అసిరితల్లి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పొందూరు: మండలంలోని కనిమెట్ట గ్రామంలో ఘనంగా అసిరితల్లి అమ్మవారి పండగను మంగళవారం నిర్వహించారు. ప్రతి ఏటా వరి విత్తనాలు చల్లిన తర్వాత గ్రామదేవత అసిరితల్లికి ముర్రాటలు చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. తప్పెటగుళ్లు, నృత్యాలతో గ్రామస్తులు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేతన్న నేస్తంపై హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో చేనేత కుటుంబాల లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సర్పంచ్ బోసి రామారావు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. చాపర గ్రామానికి చెందిన 48 మందికి నేతన్న నేస్తం ద్వారా ఒక్కొక్క మగ్గానికి రూ.24,000 చొప్పున రూ.11.52 లక్షలు ఖాతాలలో జమయ్యాయన్నారు. వరుసగా మూడో ఏడాది కూడా ఆదుకున్నారన్నారు. ఈ పథకం ద్వారా చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాడి అప్పారావు, శశిభూషణ రావు, సింహాచలం, బత్తల శంకరి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా 3,172 మొక్కలు



మొక్కల లెక్క చూస్తున్న ఏపీఓ యుగంధర్

నరసన్నపేట: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు, రోడ్డుకు ఆనుకొని స్కూళ్లు, చెరువు గట్లుపై నాటేందుకు 3172 మొక్కలు వచ్చాయని ఏపీఓ యుగంధర్ మంగళవారం తెలిపారు. వీటిల్లో కొబ్బరి 750, మామిడి 232, జీడి 35, జామ 45, సపోటా 10, మునగ 2100 మొక్కలు వచ్చాయని, వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. ఉర్లాం, లుకలాం స్కూళ్లల్లో కూడా పండ్ల మొక్కలు నాటనున్నామని తెలిపారు. వీటిని రైతులు సంరక్షించుకోవాలన్నారు.

310 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని దూకులపాడులో సర్పంచ్ అల్లు అసిరినాయుడు ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. దీంట్లో 310 మందికి తనిఖీలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి సత్యనారాయణ, జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ విద్యతో మేలు



మాట్లాడుతున్న ఎంఈఓ రమణ

సారవకోట: డిజిటల్ విద్యతో విద్యార్థులకు మేలు కలుగుతుందని ఎంఈఓ ఎం.వి.రమణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన ఐఎఫ్‌పీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎఫ్‌పీల ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్లో బోధనతోపాటు వాటిని గ్రీన్ బోర్డులుగా వినియోగించుకోవచ్చునన్నారు. ఉపాధ్యాయులు సెలవు పెట్టేటప్పుడు వారు బోధించాల్సిన అంశాలను రికార్డు చేసి బోధించవచ్చునన్నారు. హెచ్‌ఎం రామకృష్ణ ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని జలుమూరు మండలంలో గల రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ హెచ్‌కె కామాక్షి మంగళవారం తెలిపారు. తిమడాం-2 ఆయా పోస్టు బీసీ ఏకు, కొమనాపల్లి-1 ఆయా పోస్టు బీసీ-డికి కేటాయించామన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు వచ్చే నెల 3వ తేదీలోగా సారవకోట ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జోరు వర్షంలోనూ..
గడపగడపకు మన ప్రభుత్వం



బూర్జ: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

బూర్జ: జోరు వర్షంలోనూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలను స్పీకర్ తమ్మినేని సీతారాం, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించారు. బూర్జ మండలం తోటవాడ గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను స్పీకర్ ప్రజలకు వివరిస్తూ.. సమస్యలను అగిడి తెలుసుకున్నారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. పథకాలు కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మంచినీరు అదజేయాలని, మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. తోటవాడ గ్రామానికి రూ.కోటితో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేయడం జరిగిందని, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, స్థానిక సర్పంచ్ సూర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని గ్రామ సచివాలయ-2 పరిధిలోని ఎగువ కంద్రవీధిలో మంగళవారం సాయంత్రం వర్షం కురుస్తున్నా.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో, లేదా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఈ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖను అందజేశారు. ఇళ్ల స్థలాలు, కాలనీలు కావాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. వారి వద్ద నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఏపీఎం మణిరత్నం, ఈఓ కూర్మారావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునుడు, తాతయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, బి.నారాయణరావు, దొర పార్వతీశం, పనుకు మోహన్, ఎం.వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం



పాగోడులో ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- సచివాలయ వ్యవస్థతో వినూత్న మార్పులు
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: విద్య, వైద్యం, వ్యవసాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చి.. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పాగోడు, వెలుసోదలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు, సీసీ రోడ్లుకు శంకుస్థాపన, తాగునీటి చెరువును, సచివాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థతతో వినూత్న మార్పులు తెచ్చి పాదర్శకత పాలన, ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వలంటీర్లు సేవలను దేశం మొత్తం గుర్తించి వారికి కితాబు ఇస్తే.. పవన్ కల్యాణ్ మాత్రం వారిని కించపరిచేలా మాట్లాడం తగదన్నారు. దీనికి ప్రతి ఫలంగా సరైన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న పవన్ ఒక్కసారి విజ్ఞతతో ఆలోచన చేయాలన్నారు. అమరావతిలో పేదలకు 50 వేలకు పైగా పట్టాలు అందించిన సీఎం జగన్‌ను దేవుడంటూ కొలుస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉంటే చూసి ఓర్వలేని చంద్రబాబు మళ్లీ పవన్‌తో కలిసి కుట్ర రాజకీయాలు చేస్తున్నాడన్నారు. వికేంద్రీకరణతో మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నది సీఎం జగన్ లక్ష్యమన్నారు.

స్వతంత్రంగా ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లావా చంద్రబాబు..

చంద్రబాబు ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో స్వతంత్రంగా ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లాడని ఎమ్మెల్యే ప్రశ్నించాడు. ఒకసారి సీపీఐ, సీపీఎం, మరోసారి బీజేపీ, జనసేనతో కలిసి ఎన్నికలకు వెళ్లడమే తప్ప.. ధైర్యంగా ఒక్కడు ఎప్పుడూ ఎన్నికలకు వెళ్లిన దాఖలాలు లేవన్నారు. చంద్రబాబుకు నిజంగా బలం ఉంటే సొంతంగా ఎన్నికలకు వెళ్లి ప్రజా కోర్టులో నెగ్గాలన్నారు. ఎంపీపీ వాన గోపి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, ఎంపీటీసీ రావాడ చందనబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తండ్యాల జగన్నాథరావు, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, మండల సలహాదారు పైడి విఠలరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షుడు రాజప్పలనాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చరిత్ర మరిచిపోయావా 'కలమట'?



మెళియాపుట్టి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి.. టీడీపీలోకి ఫిరాయించిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ.. నేడు చరిత్ర మరిచి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెలుగు దేశం వాళ్లు ఇచ్చిన ప్యాకేజీకి గత ప్రభుత్వ హయాంలో అమ్ముడుపోయి, పాతపట్నం ప్రజలను, రాజకీయ భిక్షపెట్టిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలమట మోసం చేశారన్నారు. హిరమండలం వంశధార నిర్వాసితులకు ప్యాకేజీల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. అన్నా.. అంటూ సీఎం జగనన్న దగ్గర నక్క వినయం ప్రదర్శించి టిక్కెట్ దక్కించుకుని 2014 గెలిచి.. నేడు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఒక మహిళా ఎమ్మెల్యే అయిన తనని వ్యక్తిగతంగా విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మహిళలపై ఆయనకు ఉన్న అభిప్రాయం ఏమిటో తెలుస్తుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనీ, ఇలాంటి వ్యక్తులను మళ్లీ ప్రజల్లోకి వస్తే తిరగనివ్వరని, అసలు మహిళలు విశ్వసించరన్నారు. అనంతరం పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, సర్పంచ్ జయలక్ష్మి, ఎంపీటీసీ హంసమ్మ, మండల నాయకుడు ఉదయ్‌కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తూరు: టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ విశ్వాస ఘాతకుడని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. మండలంలోని సోమరాజపురంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలమటకు టీడీపీ తరపున ఈ జన్మలో ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం లేదన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన కలమట ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి కోట్లాది రూపాయలకు అమ్ముడుపోయన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, సర్పంచ్‌లు శిమ్మ మల్లేశ్వరి, నాగళ్ల అప్పన్న, వైస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

జగనన్న సురక్షతో అర్హులందరికీ మేలు కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని తీసుకుని ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యలు పరిష్కరించింది. 11 రకాల సేవలను ఉచితంగా అందించారు. మంగళవారం నరసన్నపేట, పాతపట్నం నియోజక వర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. అర్హులకు ధ్రువపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: అలుదులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: సోమరాజపురంలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: తిమడాంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



నరసన్నపేట: లుకలాంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, పార్టీ నాయకులు

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



దబ్బపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ గణపతిరావు

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.గణపతిరావు అన్నారు. మండలంలోని మిరియాపల్లి, దబ్బపాడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు మంగళవారం పరిశీలించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్, తాగునీటి బోర్లు తక్షణమే ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తే ఇంటి నిర్మాణ సామగ్రీతో వచ్చిన భారీ వాహనాలతో నష్టం జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యే సరికి వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. రెండు గ్రామాల్లోనూ ఇళ్ల నిర్మాణ పురోగతి బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నిర్మాణ పనులు ఆపామని లబ్ధిదారులు తెలిపారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపట్టాలని, అక్టోబర్ నాటికి పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరగాలని పీడీ సూచించారు. బిల్లుల చెల్లింపు త్వరగా చేయాలని పీడీని లబ్ధిదారులు అడిగారు. ఇప్పటి వరకు నిర్మాణం జరిగిన స్థాయిలకు సరిపడా బిల్లులు పెట్టామని త్వరలోనే బ్యాంకు ఖాతాలకు జమచేయటం జరుగుతుందని పీడీ వివరించారు. ఇప్పటికే కొందరి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమచేయటం జరిగిందన్నారు. మిగిలిన వారికి కూడా వారం రోజుల్లో జమ అవుతాయన్నారు. గృహ నిర్మాణశాఖ ఈఈ జోగారావు, డీఈ నర్సింగరావు, ఏఈ కె.రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు లుకలాపు సుధీర్, ముద్దాడ అప్పలనాయుడు ఉన్నారు.

రూ.50లకే కిలో టమాటా



టమాటా విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: పేదవాడి జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా భరోసాగా కల్పిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని రైతు బజార్‌లో ప్రజలకు రాయితీపై కేజీ టమాటా రూ.50లకు అందించే కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవినాగ్ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల రేట్లు పెరిగినప్పుడల్లా ప్రభుత్వమే రాయితీతో సరుకులను అందజేస్తుందన్నారు. గతంలో ఉల్లిపాయలు, ఈ మధ్యకాలంలో సన్న బియ్యం సబ్సిడీపై అందించిన విషయాన్ని గుర్తుచేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర మల్లేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సీదిరి పర్యటన

హిరమండలం: రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు హిరమండలంలో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మంగళవారం తెలిపారు. హిరమండలం వంశధార జలాశయం వద్ద నిర్మిస్తున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులను మంత్రి పరిశీలిస్తారన్నా రు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పి.విజయ పాల్గొంటారని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్య సేవలు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న లక్ష్మీతులసి

నరసన్నపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రాంతో గ్రామీణ ప్రజలకు వైద్యం అందుబాటులోనికి వచ్చిందని జిల్లా నోడల్ ఆఫీసర్, అదనపు డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి అన్నారు. నరసన్నపేట నాయుడు వీధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మాకివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. రోగుల వివరాలు ఆన్‌లైన్లో భద్రపరచాలని సూచించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. జ్వర బాధితులు వస్తే వారికి తగు సలహాలు ఇవ్వాలని సిబ్బందని ఆదేశించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, మాకివలస డాక్టర్ దుష్యంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

పోలాకి: క్షేత్రస్థాయిలో అందిస్తున్న ఆరోగ్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి ఆదేశించారు. ఈదులవలస గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. బీపీ, టీబీ, డయాబెటిక్ వంటి రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయటం వల్ల వారిని రెగ్యులర్‌గా క్షేత్రస్థాయి సిబ్బందితో ఫాలోఅప్ చేయవచ్చని సూచించారు. పోలాకి పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనాథ్, సుమ, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, సిబ్బంది ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఏబీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రకాష్

పాతపట్నం: సమరశీల సంఘటిత పోరాటాలే దళిత సమస్యలకు పరిష్కార మార్గాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌లో దళిత డప్పు కళాకారుల సంఘం (డీకేఎస్) ఆధ్వర్యంలో దళిత డప్పు కళాకారులకు రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని దళితుల సమస్యలకు పోరాటాలే పరిష్కారం చూపిస్తాయని, సమస్యలపై దీర్ఘకాలంగా పోరాటం సాగించాలన్నారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మతోన్మాద పాసిజం రాజ్యమేలుతుందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి డీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ పూలమావేసి నివాళులర్పించారు. డీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సంజీవ్, పి.ఈశ్వరరావు, కృష్ణమూర్తి, భాస్కరరావు, అప్పలస్వామి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన



కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: మండలంలోని పారాపురం-కలిగాం కూడలి మధ్య నిర్మించిన కల్వర్టును ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం పరిశీలించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డు పైనుంచి వరదనీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. వెంటనే ఎమ్మెల్యే స్పందించి.. ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు ఈ విషయం తెలియజేయడంతో కల్వర్టు నిర్మించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆమదాలవలస: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణాధికారి పి.వి.సత్యనారాయణ ఆదేశించారు. డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి, వార్డు సచివాలయ ఆరోగ్య, పారిశుద్ధ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ ఇచ్చారు. ప్రతీ శుక్రవారం డ్రై డే విధానం ఆచరించేలా చొరవ చూపాలన్నారు. జిల్లా సహాయ మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు, సలహాదారు ఎల్.కిశోర్, ఉప విభాగ అధికారి కె.ఎస్.అప్పారావు, మెట్టక్కివలస, మోనింగివారివీధి పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు జి.సాయికిరణ్, ఎస్.శాంతిప్రియదర్శిని పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషిచేయాలి

పొందూరు: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని సర్వశిక్షా అభియాన్ జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు కోరారు. కింతలిలోని పీఎల్ఎస్‌జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ప్రశస్త యాప్‌లో దివ్యాంగుల నమోదును వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ గైడ్‌లైన్స్ ప్రకారం 21 రకాల వైకల్యాలు గల విద్యార్థులను గుర్తించడానికి 63 అంశాలతో కూడిన యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రశస్త యాప్‌ను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కింతలిలో తేజస్వరూర్ అనే దివ్యాంగుడిని గుర్తించినట్లు తెలిపారు. జిల్లా సహాయ సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్.అనురాధ, భీవిత ఐఈఆర్టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పారాలీగల్ కార్యకర్తలు నియమానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, జిల్లా మండల న్యాసేవా సంస్థ అధ్యక్షురాలు కె.శారదాంబ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయినవారు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల కార్యకర్తలు, వైద్యులు, న్యాయ సంబంధిత విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, క్లబ్ సభ్యులు, ఇతర స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రీసర్వే త్వరగా పూర్తిచేయాలి

బూర్జ: మండలంలో భూములు రీ సర్వే క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి సూచించారు. మండలంలోని ఉప్పినివలస, ఏబీసీ పేట, కొరగాం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఉప్పినివలస సచివాలయాన్ని పరిశీలించి డీఎల్‌ఓ, వీఆర్వో లాగిన్‌లను పరిశీలించారు. ఉప్పినివలసలో చేపడుతున్న ఓటర్ జాబితాను తనిఖీ చేశారు. తహసీల్దార్ ఎస్.రమణారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పశువులను కబేళాలకు తరలిస్తే చర్యలు

కొత్తూరు: పశువులను కబేళాలకు తరలిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ ఎం.గోవిందరావు హెచ్చరించారు. మండలంలోని బలదలో మంగళవారం జరిగిన వారపు సంతను సందర్శించారు. పశువులను సంతలు కేంద్రంగా చేసుకొని కబేళాలకు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సంతను సందర్శించారు. పశువులను నిబంధనలకు విరుద్ధంగా వ్యాన్‌లపై తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నీట మునిగిన పొలాల పరిశీలన

హిరమండలం: నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కోరాడ, గొట్ట, సుభలయ, దుర్బలాపురం గ్రామాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, ఏఓ సంధ్య మంగళవారం నీటమునిగిన పొలాలను పరిశీలించారు. ఎంత మేర నష్టం జరిగిందో అంచనాలు వేసి స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఏఓ తెలిపారు. మండల పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ ఉన్నారు.